

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

మంగళవారం 04 జులై 2023

మినీ ఫంక్షన్ హాల్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ -తిరుమలగిరి

తిరుమలగిరి మండలం తొండ గ్రామ రెవెన్యూ పరిధిలో కథంబ వనం వెంచర్ ద్వారా గ్రామ పంచాయతీకి కేటాయించిన 1-30 గుంటల విస్తీర్ణంలో గుండు వెంకటేశం, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కుమార్తె గుండు యాదమ్మ, అల్లుడు బండారి కోటిలింగం కుమార్తె అవిరేణి శిరేక,మనమలు, మనమరాళ్లు బండారి రవి తేజ , రాహులు, నీతిక్షమ పంచాయతీ కీ మినీ ఫంక్షన్ హాల్ నిర్మించడానికి ముందుకు వచ్చారు. సోమవారం ఎంపీపీ ఎన్.స్నేహలత, సర్పంచ్ శాతనవాహనరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకన్న కార్యదర్శి జి యాకుబ్ రెడ్డి వార్డ్ సభ్యులు అన్ని పార్టీల గ్రామ శాఖ అధ్యక్షులు , ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

తైబజార్ వేలంపాట

నవతెలంగాణ-డిండి

డిండి మండల కేంద్రంలో తైబజార్ వేలంపాటను ఈ నెల 5న బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనుటకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐదువేల రూపాయలు (5000) ముందస్తుగా డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంపాటలో పాల్గొని వేలంపాట గెలుచుకున్న వారికి తైబజారు నిర్వహించే బాధ్యత ఒక సంవత్సరం పాటు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు గ్రామపంచాయతీ కార్యాలయములో సంప్రదించి వేలంపాటలో పాల్గొనేందుకు తమ వివరాలను తెలియచేయాలని తెలిపారు. వేలంపాటలో పాల్గొని వేలం కోల్పోయిన వారి నుండి వేలం పాటలో పాల్గొన్నందుకు రూ.500రుసుము విధించి మిగిలిన రూపాయలు తిరిగి ఇవ్వబడుతుందని, ఆసక్తిగల వారు గ్రామపంచాయతీ కార్యాలయము నందు సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయం జరిగేనా..!



- అన్ని అర్హతలు ఉన్నా పాత పెన్షన్‌కు దూరం
- పదిహేడేండ్లుగా ప్రభుత్వాలను వేడుకుంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- అధికార, ప్రతిపక్ష పార్టీలకు, ఉద్యోగ సంఘాలకు వినతి పత్రాలు సమర్పిస్తున్న బాధితులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీపీఎస్ అమలు తేదీ 01-09-2004 కు ముందు నియామక నోటిఫికేషన్లు విడుదలై 01-09-2004 అనంతరం నియామకం జరిగి కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానంలో కొనసాగుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పాత పెన్షన్ పోరాట సమితి బాధితులు గత పదిహేడేళ్లుగా ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో దరిదాపు అన్ని విభాగాల నుంచి 8 వేల మంది ఉంటారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి దరిదాపు నాలుగు వందల మంది ఉంటారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వీరంతా ఈ సారైనా తమ సమస్య తీర్చాలనే ఆశతో వివిధ పార్టీల నాయకులకు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలకు హైదరాబాద్ కేంద్రంగా, వివిధ జిల్లాలలో అధికార, ప్రతిపక్ష పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల చుట్టూ వినతి పత్రాలను సమర్పిస్తూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నవతెలంగాణ-నకిరేకల్

పీఎఫ్ ఆర్డీ చట్టం ప్రకారం 1జనవరి 2004 నుండి దేశంలో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం అమలులో భాగంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 01-09- 2004 నుండి సీపీఎస్ విధానం అమలు చేయడం జరుగుతుంది. నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్(సిపిఎస్)అమలు తేది కంటే ముందు నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల సీపీఎస్ అమలు తేదీ తర్వాత నియామకం జరిగిన ఉద్యోగ ఉపాధ్యాయులు బలవంతంగా నూతన పెన్షన్ పరిధిలోకి తీసుకురావడం జరిగింది. తమకు జరిగిన అన్యాయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఉద్యోగులు తీసుకువెళ్లిన నేపథ్యంలో వారికి న్యాయం చేకూరుస్తూ 01-01- 2004 నాటికి ముందు నియామక ప్రక్రియ పూర్తి అయి 01-01- 2004 తర్వాత జాయిన్ అయిన వారిని తిరిగి పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువస్తూ మెమో నంబర్ 57/4/2019, 17/2/2020 విడుదల చేశారు. ఆ తర్వాత కూడా మరింత స్పష్టత నిస్తూ మెమో నంబర్ 57/5/2021, 03-03- 2023 విడుదల చేస్తూ తేదీ 22- 12 -2003 నాటికి నోటిఫికేషన్ విడుదలై సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న వారందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువెళ్లేలా ఉత్తర్వులు ఇచ్చారు. పీఎఫ్ఆర్డీఏ చట్టం ప్రకారం సీపీఎస్ విధానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే మార్పులు, చేర్పులు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరించాల్సి ఉంటుంది. కంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకనుగుణంగా రాష్ట్రంలో కూడా సీపీఎస్ అమలు తేదీ 01-09-2004 ముందు నోటిఫికేషన్ విడుదలై నియామకాలు ఆలస్యం జరిగి సీపీఎస్ పరిధిలోకి బలవంతంగా నెట్టివేయబడిన సుమారు 8వేల ఉద్యోగ ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువచ్చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉంది. కేంద్ర మెమో ప్రకారం గతేడాది ఫిబ్రవరి నెలలో ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు వివిధ విభాగాల నుంచి సేకరించింది కానీ నేటికి అమలు ఉత్తర్వులు ఇవ్వలేదు.



పుష్కర కాలంగా ఉద్యమాలు

పదిహేడేండ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు, పోరాటాలు,రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రాతినిధ్యాలు చేస్తున్నారు.మంత్రుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగారు. గత వారం రోజులుగా తమ సమస్య పరిష్కారం చేసేలా చొరవ తీసుకోవాల్సిందిగా సిఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బీ.వినోద్ కుమార్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తమ రెడ్డి, ఎవిన్ రెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, టీఎన్జీఓ, టీజీఓ, టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, గెజిటెడ్ ఉద్యోగుల సంఘాలకు ప్రతినిధులకు వినతి పత్రాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా స్పందించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మీది న్యాయమైన డిమాండ్, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా అర్హత కలిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని, ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం చేస్తామని హామీ ఇచ్చారు.

న్యాయం చేయాలి

టీ. నరసింహామూర్తి (పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు)

అన్ని అర్హతలు ఉన్న మాకు న్యాయం చేయాలి. కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ మెమో నెంబర్ 57 అనుసరించి మాకు పాత పెన్షన్ పథకం వర్తింపజేయాలి. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే చెప్పుకునే ప్రభుత్వం మానవతా దృక్పథంతో తెలంగాణ రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ఉన్న సుమారు 8వేల ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

సీఎం కేసీఆర్ అత్యంత మానవీయ కోణంలో పరిపాలన

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- పోడుభూములకు పట్టాలు పంపిణీ



నవతెలంగాణ -భువనగిరిరూరల్

దేశంలో అత్యంత మానవీయ కోణంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని, ప్రజల కోరిక మేరకు ప్రపంచంలోనే పరిపాలన రంగంలో ఎవరూ చేయని విధంగా కేవలం 9ఏండ్లలో 60 ఏండ్ల బాధలు తీర్చేలా అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అద్భుతంగా నిర్వహిస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోడు భూముల పట్టా పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి గిరిజనులకు పట్టాదారు పానుస్తకాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొందిన మిగతా దేశాలతో పోల్చితే దేశంలో ఆశించిన ప్రగతి జరుగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గ్రామాలలో బిందెలతో కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకున్న దుస్థితి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు ఫ్లోరోసిస్ శాపంగా ఉండేదన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. అనేక పథకాలు, మంచినీరు, విద్యుత్, రోడ్లు, 1000 రెసిడెన్షియల్ పాఠశాలలు, నూతన మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులను మెరుగుపరచుకొని బస్తీ, పల్లె దవాఖానాలతో వైద్య రంగం విస్తృతమైందని, అనేక వృత్తులలో జీవిస్తున్న వారికి సహాయపడుతూ పెన్షన్లు, కేసీఆర్ కిట్స్, ఆరోగ్య సమాజానికి తల్లిబిడ్డల రక్షణ, న్యూట్రిషియల్ కిట్స్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర అన్ని పథకాలను ముందుకు నడుపుతున్నారని, వ్యవసాయ రంగానికి చేయూతనివ్వాలని 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి 50 లక్షల ఎకరాలను స్థిరీకరించారని, ముఖ్యమంత్రి కేసీఆర్ కు రైతాంగం పట్ల ప్రేమే దీనికి నిదర్శనమన్నారు. జిల్లాలో తుర్కపల్లి, నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు సంబంధించి 205 మంది గిరిజన రైతులకు 213 ఎకరాల భూములకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించుకున్నాక అన్ని వర్గాల కన్నా గిరిజన వర్గాల వారు చాలా లబ్ధి పొందుతున్నారని, వారిలో గొప్ప మార్పును చూస్తున్నామని అన్నారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అవతరించాక గిరిజనాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చెపట్టిందన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ కింద 2130 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 205 దరఖాస్తులు ఎంపిక అయ్యాయని తెలిపారు. 128 మందికి పట్టాల పంపిణీ చేయడం జరుగుతున్నదని, మిగతా 77 మందికి త్వరలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి, డిప్యూటీ పోలీసు కమిషనర్ రాజేశ్ చంద్ర, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ డి. శ్రీనివాసరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ బీకూ నాయక్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి క్రిష్ణా రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగిరెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజా రాణి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసలు, సర్పంచులు, జిల్లా అధికారులు,పాల్గొన్నారు.

ఆకృతికి ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్ అవార్డు

నవతెలంగాణ- భువనగిరిరూరల్

భువనగిరి పట్టణానికి చెందిన శ్రీ ఆర్ కె హాస్పిటల్స్ డాక్టర్ చావా రాజ్ కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంపతుల కుమార్తె చిన్నారి చావా ఆకృతి 194 దేశాలు, వాటి రాజధానుల పేర్లను నాలుగు నిమిషాల 35 సెకండ్లల వ్యవధిలో చూడకుండా చెప్పింది. చిన్నారికి ప్రతిభకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచే మెడల్ అవార్డును అందజేశారు. సోమవారం చిన్నారిని మంత్రి జగదీశ్ రెడ్డి , ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి , అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ , శ్రీనివాస్ రెడ్డి, డీసీపీ రాజేష్ చంద్ర అభినందించారు. తమ కుమార్తె అవార్డును దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని చిన్నారి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ధర్మారెడ్డి పల్లి కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- రామన్నపేట

మండలంలోని సర్నేనిగూడెం గ్రామ శివారులో 17వ కిమీ వద్ద ధర్మారెడ్డిపల్లి కాల్వను సోమవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. నీటి పారుదల శాఖ అధికారులతో కాల్వ నిర్మాణంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాంట్రాక్టర్ పనులు చేయనందున ఆయన కాంట్రాక్టు ను రద్దుచేసి, కొత్త టెండర్ వేయడానికి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ అధికారులను ఆయన అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాల్వ నిర్మాణం పూర్తి చేసేందుకు కావలసిన మరికొన్ని నిధులు కూడా విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని చెరువులోకి మళ్లించాలని ఆయకట్టు ప్రాంత రైతులు కోరారని ఆ ప్రయత్నాలు ముమ్మరం చేసామన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఎడ్ల మహేందర్, రెడ్డి, ఎంపిటిసి తిమ్మాపురం మహేందర్ రెడ్డి, పి ఎస్ సి ఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, నాయకులు కునూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.



కొల్లు శ్రీనివాస్ గౌడ్‌కు ఓయూ డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ -సూర్యాపేట రూరల్



సూర్యాపేట మండల పరిధిలోని కాసరబాధ గ్రామానికి చెందిన కొల్లు శ్రీనివాస్ గౌడ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాలలో గల ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ శ్రీ బి . అమరేందర్ రెడ్డి పర్యవేక్షణలో సూర్యాపేట, భువనగిరి మున్సిపాలిటీలలో ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంధాన్ని యూనివర్సిటీ అధికారులు ఆమోదించారు.2009 సంవత్సరంలో ఇదే విశ్వవిద్యాలయం నుండి ప్రభుత్వ పాలనాశాస్త్రం లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శ్రీనివాస్ 2010 సంవత్సరం నుండి అధ్యాపకుడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రస్తుతం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కనకచంద్రం ,గౌడ ఉద్యోగుల సంఘం నేతలతో పాటు, కుటుంబ సభ్యులు, కాసరబాద గ్రామంలోని ప్రముఖులు శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ భాస్కరరావు అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన 79 దరఖాస్తులు అందాయి. ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడి తగు పరిష్కారాలను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కు పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తుదారులలో పెన్షన్లు, సంక్షేమ పథకాలు, భూ సమస్యలు, ల్యాండ్ సర్వే కు సంబంధించిన దరఖాస్తులు వచ్చినందున ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కాజా నిజాం అలీ అప్సర్, డి ఆర్ డి ఓ కాళిందిని, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల వాయిస్ పత్రిక తేవడం అభినందనీయం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ- భువనగిరిరూరల్



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో వికలాంగుల వాయిస్ మాస పత్రిక తేవడం అభినందనీయమని అదనపు కలెక్టర్ దీపక్ తీవారి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వికలాంగుల వాయిస్ మాసపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పత్రిక ద్వారా వికలాంగులు మరింత చైతన్యవంతం కావాలని కోరారు. వికలాంగుల చట్టాలు సంక్షేమ పథకాలను వికలాంగులలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పత్రిక దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు సురుపంగా ప్రకాష్, వనం ఉపేందర్ మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పత్రిక ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జీవోలు ,సర్క్యులర్స్ వికలాంగుల చట్టాలను పత్రికలో రెగ్యులర్ గా ముద్రిస్తున్నామని వాటిని చదివి వికలాంగులు మరింత చైతన్యవంతం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోశాధికారి బోల్లేపల్లి స్వామి మహిళా కన్వీనర్ కొత్త లలిత జిల్లా ఉపాధ్యక్షురాలు కాటపల్లి రజిత జిల్లా నాయకులు జోకు స్వామి కటాకమోజు అంజన్ శ్రీ పాల్గొన్నారు.

బహదూర్ పేట ప్రాథమిక పాఠశాల పరిశీలన

నవతెలంగాణ -ఆలేరుటౌన్



పురపాలక సంఘంలోని బహుదూర్ పేట ప్రాథమిక పాఠశాలను సోమవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సూరేపల్లి సూర్య నారాయణ పరిశీలించారు. అదేవిధంగా మంతపురి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను చదివించి పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు.ఆయన వెంట కాంప్లెక్స్ సీఆర్‌పీ మద్దెల తిరుపతి ఉన్నారు.

ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడలోని ప్రయివేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ దోపిడికి పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి, మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ అన్నారు. సోమవారం నల్లగొండలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావుకి వినతి పత్రం అందజేసి అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో అడ్మిషన్ పేరుతో వై పాఠశాల యజమాన్యం 30 వేల రూపాయలు వసూలు చేస్తు పాఠశాలలో పుస్తకాల పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా విద్యాధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 59 విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత నిర్బంధ విద్య కల్పించాలని నిబంధనలు పెట్టినప్పటికీ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యారంగాన్ని వ్యాపారం చేస్తూ పుస్తకాలు, యూనిఫామ్, స్కూల్ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న విద్యాసంస్థ యజమాన్యంపై డీఈవో స్పందించి గుర్తింపును రద్దుచేసి యజమాన్యంపై చర్యలు తీసుకొని పేద విద్యార్థులకు తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రులను కలుపుకొని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరన్ననాయక్, శివ, మనోహర్, మధు, అఖిల్, కిరణ్, కిషోర్, మహేష్, కొటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా బుద్ధవనం

- తెలంగాణ పర్యాటక శాఖ సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధావనాన్ని అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని తెలంగాణ పర్యాటకశాఖ సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుద్ధవనంలో నిర్వహించిన ఆషాడ పూర్ణిమ ధర్మ చక్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చక్కటి జీవితానికి అష్టాంగ మార్గాన్ని అందించిన బుద్ధ భగవానుని బోధనలను ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధావనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య బుద్ధవనం అభివృద్ధికి ముఖ్య మంత్రి కేసీఆర్ ఎంతో చేయూతనిచ్చారని, తెలంగాణలో బౌద్ధ పర్యాటకానికి బుద్ధవనం ప్రధాన కేంద్రం అని రాబోయే రోజులలో మరింత మంది అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షిస్తుందన్నారు. పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ... నాగార్జునసాగర్ మరిన్ని పర్యాటక ఆకర్షణలను చేర్చి ప్రపంచ స్థాయి సౌకర్యాలను కల్పించి దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. బౌద్ధ విషయ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ధర్మచక్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాలను, పిజి సెంటర్ నెలకొల్పడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, నల్లగొండ జిల్లాలోని బౌద్ధ స్థావరాలను నాగార్జునసాగర్‌కు కలుపుతూ ఒక పర్యటక వలయాన్ని అభివృద్ధి చేయాలని గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆచార్య ఉపేందర్‌రావు రచించిన వజీరసార గ్రంధాన్ని పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, బుద్ధావనం ఓఎస్డి సుధన్‌రెడ్డి, బుద్ధవనం ఎక్స్‌పర్ట్ కన్సల్టెన్సీ ఈమని శివనాగిరెడ్డి, ఎంజీయూ పీజీ విద్యార్థులు బౌద్ధాభిమానులు పాల్గొన్నారు.

31 వరకు ఆపరేషన్ ముష్కాన్ స్పెషల్ డ్రైవ్

- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలి

ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

నవతెలంగాణ-సూర్యాపేట



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.ఈ నెలలో నిర్వహిస్తున్న తొమ్మిదవ విడత ఆపరేషన్ ముష్కాన్ కార్యక్రమానికి సంబంధించి అధికారులతో సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశ%శీ% లో ఆయన మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణ నిరోధం, తప్పిపోయిన బాలల గుర్తింపు, నిరాదరణకు గురైన పిల్లల సంరక్షణ లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బాలలను వేధింపులకు గురిచేసిన, వెట్టిచాకిరి చేయిస్తున్న, ఇతర ఏ రకంగా నిరాధారణకు గురి చేసిన అలాంటి వారి సమాచారాన్ని పోలీసు వారికి లేదా చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అందజేయాలని కోరారు. సమాచారాన్ని డయల్ 100, చైల్డ్ హెల్ లైన్ 1098 కి సమాచారం అందించాలన్నారు. పోలీస్ టీమ్స్ చైల్డ్ వెల్ఫేర్ లేబర్ డిపార్మెంట్ హెల్త్ డిపార్మెంట్ షీ టీమ్స్ ఐసిడిఎస్ భరోసా సెంటర్ సమన్వయంతో పనిచేసి నిరాధారణకు గురైన పిల్లలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మెన్ రమణ రావు, లేబర్ అధికారి రాజు,డీఎస్పీ రవి, డీఎంహెచ్ఓ హర్షవర్ధన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రవి కుమార్, డివిజన్ ఇంచార్జ్ ఎస్ఐలు ప్రవీణ్, సైదులు, ఇబ్రహీం, మధు, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు నాగరాజు, నాగులమీర, పోలీస్ రిస్క్యూ టీమ్స్. పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు అందించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు అందించాలని దామచర్ల మండలం నర్సాపురం గ్రామ గిరిజన రైతులు కోరారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చెన్నయ్యకు తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లుతో కలిసి గిరిజనులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దామచర్ల మండలం పరిధిలోని సర్వేనెంబర్ 826 ఫారెస్ట్ భూముల్లో తమ తాత తండ్రుల నుంచి పోడు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాలను అందించాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోడు భూముల పట్టాల పంపిణీలో తమకు పట్టాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు పోడు పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, కుమారి, చందన, మల్లీశ్వరి, రాంబాబు. బిచ్చాలి, మంగి, సుశీల, సైదానాయక్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ -చండూర్

మండలంలోని పుల్లెంల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థుల కోసం కస్తూరి ఫౌండేషన్ చైర్మెన్ కస్తూరి శ్రీచరణ్ సహకారంతో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బొబ్బల సంధ్యారాణి మురళి మనోహర్‌రెడ్డి చేతుల మీదగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల చదివే నిరుపేద విద్యార్థుల కోసమే కస్తూరి ఫౌండషన్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, నవీన్ రెడ్డి, బోడిగే అశోక్‌గౌడ్, ఉయ్యాల సత్యనారాయణ, ఇరిగి శివకుమార్, పేసర్ల హరీష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయాలని వినతి

నవతెలంగాణ-దామరచర్ల

ఉద్యోగులను క్రమబద్ధీకరించుటం తోపాటు, కనీస వేతన స్కేల్ అమలు చేయించాలని కోరుతూ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పీ. శ్రీపాల్‌రెడ్డికి దామరచర్లలో సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా శాఖలో సుమారు 21 వేల మంది సమగ్ర శిక్షణలో భోదన, బోధనేతర సిబ్బందిగా గత15 సంవత్సరాలుగా తాము పని చేస్తున్నట్లు చెప్పారు. ఓడిశా, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల మాదిరిగా తమను కూడా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. కనీస వేతన స్కేల్ అమలు చేయడం తోపాటు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య ప్రమాద భీమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అరుణ, సైదమ్మ శారదా, పండు, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బృహత్ పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికివేత

నవతెలంగాణ-చండూర్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం ప్రతి మండలానికి పది ఎకరాల స్థలంలో పార్క్ ఒకటి ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే చండూరు మండలంలోని ధోని పాముల గ్రామంలో ఓ ప్రజాప్రతినిధి కావాలని ప్రభుత్వ స్థలం ఉందని ఆ గ్రామంలో 2020-21 సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల సుమారు 60 లక్షలు నిధులతో బృహత్ పల్లె ప్రకృతి వనంను ఏర్పాటు చేశారు. తిరిగి ఆ ప్రజా ప్రతినిధి తన అవసరానికి బాట లేదనే సాకుతో సుమారు 40 చెట్లుపైగా నరికి వేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రజాప్రతినిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెట్లు నరికి వేసింది వాస్తవమే
ఎంపీడీవో యాకూబ్‌నాయక్

బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఆ గ్రామ ప్రజాప్రతిని చెట్లు నరికి వేసింది వాస్తవమేనని, రేపు స్థలాన్ని పరిశీలించి ప్రజా ప్రతినిధిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

చెట్లు నరికింది అవాస్తవం
ధోని పాముల గ్రామ ప్రజా ప్రతినిధి

బృహత్ పల్లె ప్రకృతి వనంలో నేను చెట్లు నరికి వేయలేదు. గ్రామంలో నాకు గిట్టని వారు కావాలని నా పేరు తీసుకొస్తున్నారు. అందులో వాస్తవం లేదు.

ఎల్‌వోసీ అందజేత



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణానికి చెందిన యానాల మల్లారెడ్డికి మంజూరైన రూ. లక్ష ఎల్ఓసీని సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య క్యాంపు కార్యాలయంలో లబ్దిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నాయకులు మాద నగేష్‌గౌడ్, మంటిపల్లి వీరు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు సన్మానం

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



డాక్టర్స్ డే సందర్భంగా డీఎంహెచ్ఓ అనిమల కొండలరావును టీఎన్జీవోఎస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ ఎం. శ్రవణ్ కుమార్, జిల్లా కార్యదర్శి కంచనపల్లి కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జే.శేఖర్‌రెడ్డి, పట్టణ కోశాధికారి భీమనపల్లి దుర్గయ్య, జిల్లా మహిళా కార్యదర్శి డీ.లక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు అనురాధ, మెడికల్ డిపార్టెంట్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ నజీర్, మెడికల్ డిపార్టెంట్ ఎంప్లాయిస్ నాయకులు మచ్చగిరి, పట్టణ కమిటీ ఉపాధ్యక్షురాలు పద్మ, నాలుగవ తరగతి ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు ఏనుగు బిక్షమయ్య, ఆశా కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు కే. శైలజ, వెంకట్‌రెడ్డి, నందు, వీరభద్రమ్మ, ప్రేమలత, భాగ్యలక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం భవనానికి రూ. 30 లక్షలు మంజూరు




నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలో యాదవ సంఘం భవనానికి రూ. 30 లక్షలు మంజూరు చేసినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రకటించారు. సోమవారం ఆయన నివాసంలో నార్కట్‌పల్లి మండల యాదవ సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, యాదవులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లోపు భవన నిర్మాణానికి శంకుస్థాపన, రెండు, మూడు నెలల్లోపే భవన నిర్మాణం పూర్తి చేసేలా ఎమ్మెల్యే చిరుమర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో యాదవ సంఘం భవనానికి రూ.30 లక్షలు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను యాదవులు సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపిపి సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ-పెద్దవూర



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దుతున్నారని సర్పంచ్ దండ మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్వేదుల గ్రామ పంచాయతీలో సోమవారం విద్యార్థులకు సొంత ఖర్చులతో 35 వేల రూపాయలు విలువైన నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలకు పాఠ్యపుస్తకాలు అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు సురేష్, రామకృష్ణ, నరేష్, పూలు నాయక్, బిక్షం, మహేష్, విష్ణు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేములపల్లి ఎంపీడీఓగా జ్యోతిలక్ష్మికి అదనపు బాధ్యతలు



నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి సోమవారం వేములపల్లి ఎంపిడిఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపీడిఓగా ఉన్న ఏ.దేవిక సుమారు 20 రోజులు సెలవుపై వెళ్లగా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపడతామన్నారు.

హరితహారాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

ఎంపీడీవో యాదగిరిగౌడ్

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మానవ మనుగడకు మూలమైన వనం పెంచే హరితహారాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎంపీడీవో యాదగిరిగౌడ్ హెచ్చరించారు. ప్రతి గ్రామపంచాయతీలో 2000 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరుతూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 9 శాతం ఉన్న అడవులను 24 శాతం పెరిగేలా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా, సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు సంరక్షించేందుకు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామీణ ఉపాధిహామీ ఇన్‌చార్జి ఏపీవో రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ పున:ప్రారంభం

నవతెలంగాణ-నకిరేకల్

టీఎస్ఆర్టీసీ సూర్యాపేట డిపో ఆధ్వర్యంలో వికలాంగులకు విద్యార్థులకు మంత్రి సీజన్ టికెట్ బస్సు పాస్ కౌంటర్‌ను సోమవారం పున ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బస్సు పాస్ కౌంటర్ పనిచేస్తుందని కంట్రోలర్ ఎంఎ మన్నన్ తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమిస్తాం

- పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు
- ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- లేదంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతాం
- కలెక్టరేట్ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి
- కిక్కిరిసిన కలెక్టరేట్

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం గృహ లక్ష్మీ పథకం కింద ఐదు లక్షలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమిస్తామని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పేదలు పోరు బాట పట్టారు. ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ఉన్న పేదలు భారీగా తరలివచ్చారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలనే



నినాదంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా హోరెత్తింది. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మిర్యాలగూడ ఎమ్మెల్యే, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సమస్యలను పరిష్కరించకుండా విస్మరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పేదలు ఇల్లు, స్థలాలు, డబుల్ బెడ్ రూమ్‌ల కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నారని అయినా ఆ సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని ఆరోపించారు. అర్హులైన పేదలకు



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ప్రకటించారని గుర్తు చేశారు. కట్టిన కొన్ని ఇండ్లనైనా పేదలకు పంచలేదని వృధాగా ఉండిపోయాయని పేర్కొన్నారు. ఎక్కడైతే డబల్ బెడ్ రూములు పూర్తయ్యాయో అక్కడ కావలసిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసి పేదలకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సొంత స్థలాలు ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షలు ఇస్తానని చెబుతోంది అది ఏ మాత్రం సరిపోవని ఐదు లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఇస్తే కేంద్ర ప్రభుత్వం 10 లక్షల రూపాయలను ఇవ్వాలన్నారు. 15 లక్షల రూపాయలతో పేదలు ఇల్లు కట్టుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో పోడు భూముల సమస్య కూడాతీవ్రంగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాలకుపైగా పోడు పట్టాల కోసం దరఖాస్తు చేస్తే 4.5 లక్షల ఎకరాల ఇస్తామని, ప్రభుత్వం కొద్దిమందికే పొడుపట్టాలను పంపిణీ చేస్తున్నరన్నారు. 1.5 లక్షల మంది గిరిజనేతరులు పొడు భూముల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి కూడా పొడుపట్టాలను అంది ఇవ్వాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభం అయినందున ఏకకాలంలో రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసిన రైతులకు డబ్బులను చెల్లించాలని పేర్కొన్నారు. అమ్మిన ధాన్యానికి సకాలంలో డబ్బులు అందక రైతులు వడ్డీ వ్యాపారస్తుల వద్ద డబ్బులు తీసుకొని అప్పులపాలవుతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా సీఎం సానుకూలంగా స్పందించి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు అర్హులకు డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు, గృహ లక్ష్మీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు చెల్లించాలని జరుగుతున్న ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల స్థలాల కోసం ఎంక్వయిరీ చేసిన భూమిని నేటికీ పంచలేదన్నారు. ఆ భూములను పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలకు, డంపింగ్ యార్డులకు, ఇతర అవసరాల కోసం వాడుకుంటూ పేదలకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. గృహ లక్ష్మీ పథకం కింద మూడు లక్షల రూపాయలు సరిపోవని పెరిగిన ప్రస్తుత ధరలకు అనుగుణంగా 5 లక్షల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు వేలాది డబుల్ బెడ్రూంలు మంజూరు అయినా నేటికి పూర్తి కాలేదని తెలిపారు. కొన్ని మాత్రమే పూర్తయిన ఎక్కడ పంపిణీ చేసిన దాఖలాలు లేవని



ఆరోపించారు.

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కుటుంబ సభ్యులు పెరిగి, పెరిగిన అద్దెలతో అద్దెలు కట్టలేని పరిస్థితులలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, లేని పక్షంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, సిహెచ్.లక్ష్మీనారాయణ, బొజ్జ చిన్న వెంకులు, వీ. వెంకటేశ్వర్లు, దండంపల్లి సరోజ, పోలబోయిన వరలక్ష్మి, మహ్మద్ సలీం, గంజి మురళీధర్, మల్ల మహేష్, కొండ వెంకన్న, అవిశెట్టి శంకరయ్య, మురారి మోహన్, చెరుకు పెద్దలు, కుర్ర శంకర్‌నాయక్, డీ.రవినాయక్, నాంపల్లి చంద్రమౌళి, నన్నూరి వెంకటరమణారెడ్డి, దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతంరెడ్డి, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, కర్నాటి మల్లేశం, పెంజర్ల సైదులు, నలుపరాజు సైదులు, మన్నెం బిక్షం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మానవీయ కోణంలో ముఖ్యమంత్రి పాలన

- అద్భుత పరిపాలనతో మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- పట్టాదారులు నేటి నుండి హక్కుదారులు
- తప్పులుంటే తహసీల్దార్‌కు తెలపాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కే.చంద్ర శేఖర్‌రావు అద్భుత పరిపాలనతో రాష్ట్ర అభివృద్ధికి, వ్యవసాయ రంగం అభివృద్ధికి తీసుకున్న చర్యల కారణంగా తెలంగాణ రాష్ట్రం శీఘ్ర గతిన అభివృద్ధి సాధించి దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని, భారతదేశంలో అత్యంత మానవీయ కోణంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గిరిజనలపై ఉన్న ప్రేమ, దార్శనికత కారణంగానే పోడు చేసుకుంటున్న అడవి బిడ్డలకు హక్కులతో కూడిన పట్టాలు పంపిణీ చేయాలని



నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే నేడు నల్లగొండ జిల్లాలో అర్హులైన 2928 మంది గిరిజనులకు 5577.78 ఎకరాల అటవీ భూమికి పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నేడు పట్టాలు పొందిన రైతులందరికీ రైతుబంధు, రైతు బీమా, ఇతర రైతుల మాదిరిగానే అన్ని రకాల సంక్షేమ ఫలాలు అందుకుంటారని తెలిపారు. అదేవిధంగా గిరి వికాస్ ద్వారా కరెంటు, బోరు సౌకర్యం కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. గిరిజనులకు విద్య ఉద్యోగ ఉపాధి రంగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న ప్రభుత్వం కూడా తమదేనని ఆయన అన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా గిరిజన తండాలు, గూడేంలు తమ ప్రాంతాలను తామే పరిపాలించుకునే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 3,146 ఈతాండాలను, 3,146 గ్రామపంచాయతీలుగా మార్చిన కారణంగానే 3,146 మంది గిరిజనులు సర్పంచులు అయ్యారని చెప్పారు. దేవరకొండ శాసనసభ్యులు రవీంద్రనాయక్, మిర్యాలగూడ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు, నాగార్జునసాగర్ శాసనసభ్యులు నోముల భగత్ మాట్లాడుతూ..నల్లగొండ జిల్లా గిరిజన జాతి గర్వించాల్సిన రోజు ఈరోజు అన్నారు. సాగర్ ముంపునకు గురైన గ్రామాలు నాగార్జున సాగర్, దేవరకొండ, మిర్యాలగూడ ప్రాంతాలు వెనుకబడడంతో పాటు అత్యధిక గిరిజన జనాభా ఈ ప్రాంతాలలోనే నివసిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలు ఎక్కువ కలిగిన ఎమ్మెల్యేలు అంతా సీఎం కేసీఆర్‌ని కలిసి పోడు భూముల సమస్యలను వివరించగా, వారు వెంటనే స్పందించి మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పోడు భూములకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ఆదేశించారు. అలా వారి ఆదేశాల మేరకు మంత్రులు అధికారులు కలిసి రూపొందించిన గైడ్‌లైన్స్ ప్రకారం పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించినట్టు తెలిపారు. పోడు భూముల రైతులకు పట్టాలు అందించాలని సీఎం కేసీఆర్ కృషి కారణంగా నేడు వేలాదిమంది గిరిజనులు ఆనందోత్సవాలతో మునిగితేలుకుతున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ..అటవీ హక్కుల చట్టం 2005, డిసెంబర్, 13వ తేదీ లోపు ధరకాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 2928 మందికి 5577.78 ఎకరాల అటవీ భూమికి పట్టాలు పంపిణీ చేస్తున్నాం అన్నారు. అందులో భాగంగా నేడు 214 మందికి 360 ఎకరాలకు సంబంధించిన పట్టాలను మంత్రి చేతుల మీదుగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాగు చేస్తున్న భూమికి హక్కుదారులుగా నేటి నుంచి వీరు కొనసాగుతారని తెలిపారు. హక్కు దారులందరికీ వానాకాల సీజన్లోనే రైతుబంధు డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. మిగతా లబ్దిదారులకు నియోజకవర్గ కేంద్రాలలో పంపిణి చేస్తామని తెలిపారు. పంపిణీ చేసిన పట్టాలలో ఏమైనా తప్పులు దొర్లిన, ఇంకా ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత తాసిల్దార్ దృష్టికి తీసుకురావాలని పోడు రైతులను కోరారు. 2005, డిసెంబర్, 13 కు ముందు ఇంకా ఎవరైనా అర్హులై ఉండి దరఖాస్తు చేసుకోకపోయినా వారు తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, కావున వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ట్రై కార్ చైర్మన్ రామచంద్రనాయక్,రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ విజయ సింహ రెడ్డి, జిల్లా ఎస్పీ అపూర్వరావు, డీఎఫ్ఓ రాంబాబు, అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో గొర్ల పంపిణీ వేగవంతం చేసి నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించి ఆ తర్వాత దానిని కొనసాగించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల అప్పులు చేసి డీడీలు కట్టిన లబ్ధిదారులు ఎన్నికల కోడ్ వస్తే తమ పరిస్థితి ఏంటి అని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. లబ్ధిదారులు డీడీలు చెల్లించి గొర్రెల కోసం ఎదురుచూస్తూ సకాలంలో ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం చొరవ చూపి గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న లబ్ధిదారులు లబ్ధి పొందాలంటే నగదు బదిలీ చేయడం వల్ల వారికి నచ్చిన చోట కొనుగోలు చేసే అవకాశం కల్పించాలన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఎన్నికల తర్వాత కేవలం 167 మందికి మాత్రమే పంపిణీ చేశారని, ఖాతాలో డబ్బులు ఉన్నప్పటికీ ఇంకా 3,000 మంది పైచిలుకు లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరికీ గొర్రెల పంపిణీ చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి మెట్టు నరసింహ, చివర్ల వీరమల్లు, చిరబోయిన గట్టయ్య, మాదరబోయిన వెంకన్న, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనం వెంటనే చెల్లించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కేతేపల్లి

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికులకు పెంచిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యులు ఆదిమల్ల సుధీర్ డిమాండ్ చేశారు. కేతేపల్లి మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు ఆదిమల్ల సుధీర్ పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే పేద విద్యార్థులకు అప్పులు చేసి పుస్తెలు తాకట్టు పెట్టి మరీ విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మెను ఛార్జిలు పెంచాలని, పెండిగ్ బకాయిలు చెల్లించాలని, పెరిగిన వేతనం వెంటనే



చెల్లించాలన్నారు. కార్మికులకు పని భద్రత, ప్రమాద బీమా, ఎక్రేసియ ప్రకటించాలని, గ్రామాలలో రాజకీయ పార్టీల నాయకుల నుండి ఎలాంటి వేదిపులు లేకుండా చూడాలని, కార్మికులను మార్చుడు పద్ధతిని రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొనేటి ముత్తమ్మ, బొజ్జా ఎల్లమ్మ, నాయకులు సునీత, స్వరాజ్యం, కవిత పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన నీటి కుంట చెరువు

- కబ్జాలకు పాల్పడుతున్న అధికారపార్టీ నాయకులు
- నిద్రమత్తులో అధికారులు

నవతెలంగాణ-పెద్దవూర



నియోజకవర్గంలో ఉన్న చెరువులు కుంటలు, పంట కాలువలు అధికారుల రికార్డులు వరకే పరిమిత మాయ్యాయే తప్ప అవి ఎక్కడ క్షేత్రస్థాయిలో కనబడటం లేదు. సాగునీరు అందక ఉన్న కుంటలు అన్ని ఆక్రమణదారుల పాలవుతున్నాయి. కొన్నేళ్లుగా ఒకరిని చూసి మరొకరు ఆక్రమణదారులు పోటీలు పడి ఆక్రమించుకున్నారు. వీటిని కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా నిద్రమత్తులో తుగుతున్నారు. నిర్లక్ష్య ధోరణినితోనే నీటి కుంటలు నిర్వీర్యం అయిపోయి ఆక్రమణదారులు చేతుల్లో పంట పొలాలుగా మారిపోతున్నాయి. తిరుమలగిరి సాగర్ మండలంలోని చింతల పాలెం గ్రామ రెవిన్యూ శివారులో సర్వే నెంబర్ 52లో నాయకునితండా వద్ద నీటికుంట చెరువును ఆక్రమంగా అధికార పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంవత్సరం క్రితం జేసీబీలతో కుంటను చదును చేసి సేద్యంచేస్తున్నారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజల్లో చర్చజరుగుతుంది. ఇదే విషయంపై గత సవత్సరం మార్చి నెల 5వ తేదీన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు ఇచ్చిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నీటి కుంట ద్వారా నాయకుని తండా, తిమ్మాయిపాలెం గ్రామాలకు రెండు దశాబ్దాల నుంచి అడవిలోని వన్య ప్రాణులు, పక్షులు, రైతులు వ్యవసాయ కార్యకలాపాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణ నుంచి చెరువును కుంటను కాపాడి ప్రజలకు, అటవీ జీవరాశులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాకు ఎలాంటి విషయం తెలియదు
పాండునాయక్ (తిరుమలగిరి సాగర్ తహసీల్దార్)

నాయకుని తండాలో ఉన్న నీటి గుంట చెరువు సవత్సరం క్రితం ఆక్రమణకు గురైనట్లు మాకు తెలియదు. ఎవరు కూడా ఎలాంటి కంప్లైంట్ ఇవ్వలేదు. పరిశీలించి వాస్తవాలు తెలుసుకొని ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

గామాలభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్



గ్రామాల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో డీఎంఎఫ్టి నిధులు రూ.15 లక్షలతో కల్వర్టు పైపు, ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాష్ట్ర అగ్రోస్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళ హనుమంతరెడ్డి, నాయకులు చిట్టిబాబునాయక్, అన్నభీమోజు నాగార్జునచారి, మట్టపల్లి సైదులుయాదవ్, గడగోజు ఏడుకొండలు, అశోక్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఆకుమర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన

నవతెలంగాణ- అర్వపల్లి

మండలంలోని కోడూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ , పథకాలపై సాంస్కృతిక కళాకారులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు .హరితహారం సీజనల్ వ్యాధుల పై ప్రజలకు సూర్యాపేట జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కళాబృందంవారు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజ్ గడ్డం ఉదయ్ పాలకుర్తి శ్రీకాంత్ పాక ఉపేందర్ పల్లెల రాము లక్ష్మణ్ గజ్జి మంజుల కుందమల్ల నాగలక్ష్మి పోతరాజు శిరీష మల్లెపాక ప్రియాంక పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సూర్యాపేట

మంగళవారం 04 జులై 2023

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి పూజలు

నవతెలంగాణ -చివ్వేంల

ఆషాఢమాసపౌర్ణమి మరియు గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి శ్రీలక్ష్మీనరసింహ సమేత సుదర్శనహోమం శ్రీమాన్ కిరణ్ కుమారాచార్యులు, ఆలయపూజారి కృష్ణమాచార్యులవారి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



మంత్రి ఓటమి ఖాయం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

రానున్న ఎన్నికల్లో మంత్రి జగదీష్ రెడ్డి ని 50 వెల ఓట్ల తో ఓడించి నాగారం పంపించడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్లసమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం లో జరిగిన తెలంగాణ జన గర్జన సభలో మాజీ మార్కెట్ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, శనగని రాంబాబు గౌడ్, భాషపంపు భాస్కర్, నేరెళ్ల మధు, నంద్యాల నరేష్ రెడ్డి, దున్న బాబు తదితరులు బి.ఆర్.యస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి స్వాగతం పలుకుతున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆత్మకూరు మండలంలో ప్రభుత్వ ధనంతో క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తూ మంత్రి ఫోటోలు క్రికెట్ కిట్ల మీద ముద్రించికుంటున్నారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీలో చేరికతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడి ఈసారి మంత్రి ఓటమి చెందడం ఖాయమని పేర్కొన్నారు.

పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలి

నవతెలంగాణ-చిలుకూరు

పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాగాటి రాములు అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చిలుకూరు మండల వ్యాప్తంగా 17 గ్రామాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేద ప్రజలను గుర్తించి ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మండల వ్యాప్తంగా నిరుపేదలను గుర్తించి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూమిని పేద ప్రజలకు పంపిణీ చేయలేని, లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారసాని వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎగ్గడి లింగయ్య మాజీ ఎంపీటీసీ బత్తిని వెంకటయ్య, పిల్లి వీరమల్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డుల తనిఖీ

నవతెలంగాణ-నాగారం

మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీల రికార్డులను అడిషనల్ పిడి పెంటయ్య మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత సామాజిక తనిఖీలు భాగంగా రికార్డులను పరిశీలించామని తెలిపారు. కూలీల వేతనాలను మాస్టర్లు కొట్టివేయటం, పంచాయతీరాజ్ సమర్పించిన రికార్డులలో తేడాలని గుర్తించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ అధికారులు రికార్డులను వెంటనే సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మని వెంకన్న, ఎంపీడీవో జీ.శోభరాణి, ఏపీవో రవి, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అడ్లూరు ఉపసర్పంచ్‌గా తిరపయ్య ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని అడ్లూరు గ్రామ ఉపసర్పంచ్‌గా కందుకూరి తిరపయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీఎల్పీఓ శ్రీరాములు సోమవారం తెలిపారు. ఇటీవల అడ్లూరు గ్రామ సర్పంచ్ స్వరాజ్యం అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పుడు ఉన్న ఉప సర్పంచ్ లచ్చిరెడ్డిని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి సర్పంచిగా కొనసాగారు. గ్రామంలో ఉన్న ఎనిమిది మంది వార్డు మెంబర్లు కొంతమంది కలిసి ఇన్‌చార్జి సర్పంచ్‌పై అవిశ్వాసం పెట్టడంతో అవిశ్వాసంలో ఐదుగురు వార్డు మెంబర్లు అవిశ్వాసంలో పాల్గొని ఇన్‌చార్జి సర్పంచిని తొలగించేందుకు సహకరించారు. సోమవారం అధికారులు ఉత్తర్వుల మేరకు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఉపసర్పంచ్‌గా కందుకూరి తిరపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు ఐదుగురు వార్డు మెంబర్లు సహకరించారు. ఉపసర్పంచ్ తిరపయ్య మాట్లాడుతూ తనకు సహకరించిన వార్డు మెంబర్లకు, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు పోలీసులు తీసుకున్నారు.

ఇన్‌చార్జీల పాలనలో కొరవడిన పర్యవేక్షణ

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మన ఊరు మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులునూతన భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరటం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వలన ఆశించిన లక్ష్యం నెరవేరటం లేదు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా ఎంఈఓల ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ



చేయకపోవడం వలన ప్రభుత్వ ప్రయివేట్, ఇతర పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. సూర్యాపేట జిల్లాలో ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు 940 ఉన్నాయి. వీటి అన్నిటిని కూడా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత జిల్లా వ్యాప్తంగా ఉన్న 9 మంది ఎంఈఓల పైనే ఉంది. 23 మండలాల గాను 9 మంది ఎంఈఓ లు మాత్రం ప్రస్తుతం ఉన్నారు. వీరు కూడా ఇన్చార్జిలే.. ఆయా ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను, సీనియర్ ఉపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుంది. దీని వలన ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరటం లేదు. ఎంఈఓలు ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించడంతోపాటు ఉపాధ్యాయుల సర్వీసులు, జీతభత్యాలు తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అంతేకాకుండా జిల్లాలో ఉన్న మోడల్ స్కూల్స్ కస్తూర్బా పాఠశాలలో సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కూడా పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఒక మండల విద్యాధికారికి మూడు నుండి నాలుగు మండలాల అప్పజెప్పడం మూలంగా ఏ మండలంలో ఉంటాడో తెలియని పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేసి అన్ని మండలాల్లో విద్యాధికారులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు మేధావులు కోరుతున్నారు.

బంగారు తెలంగాణ కాదు బాధల తెలంగాణగా మార్చిన కేసీఆర్



- పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకు ఉద్యమం ఉధృతం చేస్తాం
- గృహలక్ష్మి పథకం విధి విధానాలు మార్చాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ- సూర్యాపేట కలెక్టరేట్

కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ కాలేదని బాధల తెలంగాణగా మారిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు.సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇళ్లస్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటి ఆశలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పేదల పరిస్థితి ఘోరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇండ్లు కట్టిస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారని వారి కోరికను వమ్ముచేస్తూ వచ్చింది తప్ప పేదలకు 9 సంవత్సరాల కాలంలో ఇండ్లు కట్టించిన పాపాన పోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 64 కేంద్రాలలో భూ పోరాటం కొనసాగుతుందని అన్నారు. లక్షలాదిమంది పేద ప్రజలు ఇండ్లు కావాలని కోరుతుంటే ప్రభుత్వం కేవలం వందల్లో మాత్రమే డబల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మిస్తుందని విమర్శించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇండ్లు కేటాయిస్తున్నారు తప్ప అర్హులైన పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం లేదన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామని అధికార పార్టీ నాయకులు లక్షలాది రూపాయలు పేద ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు జాను జాగా ఇవ్వమంటే ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు లక్షలాది ఎకరాలలో ఉంటే అట్టి భూములను భూ బకాసురులు అక్రమంగా అప్పనంగా ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కోట్లు గడిస్తున్న పట్టించుకునే నాథుడే కరువాయాడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గృహలక్ష్మి పథకం విధి విధానాలను ప్రకటించిందని, ఈ విధానం ప్రజలకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గృహ లక్ష్మి పథకం విధి విధానాలను సవరించాలని డిమాండ్ చేశారు. గృహ లక్ష్మి పథకం కింద నిర్మిస్తున్న ఇండ్లకు ప్రభుత్వం 3 లక్షల రూపాయల నుండి 5 లక్షల రూపాయలకు పెంచాలని అలాగే కేంద్ర ప్రభుత్వం 10 లక్షల రూపాయలు పేదల గృహ నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్



చేశారు. దళిత బంధు పథకాన్ని అన్ని గ్రామాలకు ఒకే దఫాలో ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. బలహీన వర్గాలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని వెంటనే అందరికీ లక్ష రూపాయల రుణాన్ని విడుదల చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేతి వృత్తిదారుల కు పింఛన్లు గత రెండు సంవత్సరాలుగా ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని తక్షణమే ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ కారును అడ్డుకొని నిరసన.

ధర్నా జరుగుతున్న సందర్భంగా కలెక్టరేట్ నుండి బయటకు వస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట్రావు కారును ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. ప్రజా



సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ,డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ను ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు ప్రజాసంఘాల నాయకులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. అనంతరం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్ ఏవో శ్రీదేవికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె .వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున రెడ్డి, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి ,పట్నం జిల్లా కార్యదర్శి జిల్లపల్లి నరసింహారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్ వర్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ ,జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాసాని కిషోర్ ,బోయిల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మా భూమి దక్కకపోతే చావే శరణ్యం



- అక్రమంగా పట్టా చేసిన తహసీల్దార్
- అడిగితే రూ.5లక్షల లంచం డిమాండ్
- ఎడేండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోని కలెక్టర్

నవతెలంగాణ- సూర్యాపేట కలెక్టరేట్

ధరణి పోర్టల్ లో వ్యవసాయ భూమిని ఎన్నెస్పీ కాలువ కింద నమోదు చేసి తప్పుగా నమోదు చేశారని, ఎడేండ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న కలెక్టర్ పట్టించుకోవడం లేదని గరిడే పల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మిద్దనపల్లి సోమమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని అప్పటి తహసీల్దార్ జయశ్రీని అడిగితే రూ.5లక్షలు లంచం డిమాండ్ చేశారని ఆరోపించారు. మా భూమి మకుడ్ దక్కకపోతే కలెక్టరేట్ ముందే చావుకు సిద్ధమని కుటుంబ సభ్యులతో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 60ఎండ్లుగా సర్వే నెంబర్ 1018లో 3.07ఎకరాల భూమిని సాగు చేస్తుండగా 2016లో ఎన్నెస్పీ కెనాల్ అంటూ మా పేరున ఉన్న పట్టాను రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్నెస్పీ కెనాల్ 1017 సర్వే నెంబర్ లో ఉండగా స్థానికుడైన వాల్తు శోభన్ బాబు తహసీల్దార్ తో కలిసి 1018 సర్వే నెంబర్ లో ఎన్నెస్పీ కెనాల్ ఉందంటూ సృష్టించారని దీనిపై సర్వేయర్ తో సర్వే చేసి రిపోర్ట్ ఇచ్చిన కూడా మా భూమి మీదకు రాకుండా శోభన్ బాబు, రాజ శేఖర్ అతని కుటుంబ సభ్యులు దాడులకు పాల్పడ్డారని, పోలీసులకు ఫిర్యాదు చేసిన తమ పైనే కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై 2017 నుండి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న కనీసం కలెక్టర్ పట్టించుకోవడం లేదని, ఇకనైనా కలెక్టర్ చొరవ తీసుకొని తమ సమస్య పరిష్కారం చూపాలని లేకపోతే కలెక్టరేట్ లోనే కుటుంబ సభ్యులతో సహ ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో మిద్దనపల్లి గుండమ్మ,వెంకన్న, కోటయ్య, భీమయ్య, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు తెలుసుకున్న ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సోమవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భీమార్జున్‌రెడ్డిని కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ఈ సందర్భంగా ఆయన తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో ల్యాబ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఎంపీ నిధుల నుండి ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే ఆ సమస్యల పరిష్కారం కోసం తన పరిధిలో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి తన్నీరు మల్లికార్జున్, కోతి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా పల్లె మణిబాబు

నవ తెలంగాణ-సూర్యాపేట

వ్యక్తిత్వ వికాస శిక్షణారంగంలో ఇంపాక్ట్ సంస్థ నుండి సర్టిఫైడ్ ట్రైనర్ గా సూర్యాపేటకు చెందిన పల్లె మణి బాబు శిక్షణ పూర్తి చేసుకొని ట్రైనర్ గా అర్హత సాధించారు. 32 రోజులపాటు ఆన్లైన్ క్లాసులు ప్రతిరోజు ఆడియో, వీడియో అసైన్మెంట్స్ పూర్తి చేసిన సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ లోని మినర్వా గ్రాండ్ హోటల్లో నిర్వాహకుల చే ఆయన ట్రైనర్ గా సర్టిఫికేట్ అందుకున్నారు.ఆఫ్ లైన్ క్లాసులుగా ముఖాముఖి ఒకటి రెండు తేదీలలో రోజుకు 12 గంటలు పాటు ఇట్టి శిక్షణ క్లాసులు నిర్వహించారు. పబ్లిక్ స్పీకింగ్ ,కమ్యూనికేటివ్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్ లాంటి 22 అంశాల్లో ఈ శిక్షణా క్లాసులు జరిగాయి.ఈ తరగతుల్లో అన్ని విభాగాల యందు అర్హత సాధించి సర్టిఫికెట్ పొందిన పల్లె మణి బాబు మాట్లాడుతూ ఇంపాక్ట్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన యువతకు



వెన్నుదన్నుగా నిలుస్తున్నదని తెలిపారు. అలాంటి సంస్థ ఆశయాన్ని సదా గుర్తుంచుకొని తాను సైతం అట్టి విద్యార్థులకు పూర్తి ఉచితంగా హ్యాండ్ రైటింగ్ ,మోటివేషన్ తరగతులు అందించనున్నానని పేర్కొన్నారు. ఇంపాక్ట్ సంస్థను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన గురూజీ గంప నాగేశ్వరరావు కి, నలిని మేడం ,యాదగిరి, రహీం తో పాటు తన క్లాసులకు మెంటార్స్ గా ఉన్న పదిమంది గురువులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది



- టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని రాజేష్

నవతెలంగాణ-కోదాదరూరల్

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నేటి వరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందజేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని రాజేష్(బోస్) ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి విద్యారంగా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మన ఊరు, మనబడి కార్యక్రమానికి సముచిత నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న టీచింగ్ ఎంఈఓ, డిఇఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తక్షణమే పుస్తకాలు పంపిణీ చేసి నాణ్యమైన భోజనం, దుస్తులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్టా నాగరాజు, పట్టణ నాయకులు బొడ్డు నవీన్, సాయి, చరణ్, అశ్వక్, ఆకాష్, జానీ పాషా, మణికుమార్, మోష, వాసు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగ అభివృద్ధితోనే పట్టణ అభివృద్ధి



- జీవి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్

వ్యాపార రంగం అభివృద్ధితోనే శరవేగంగా పట్టణ అభివృద్ధి జరుగుతుందని శాసనసభ్యులు బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీ షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రారంభించి మాట్లాడారు. ట్రెండ్‌కు తగ్గిన విధంగా నాణ్యమైన వస్త్రాల అమ్మకాలతో వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలన్నారు. నగరాలకు దీటుగా పట్టణంలో వ్యాపార సంస్థలు నెలకొల్పడం అభినందనీయ మన్నారు. వ్యాపార సంస్థల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. షాపింగ్ మాల్‌లో స్థానిక యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వ్యాపార సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ పక్షాన తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారులు పెద్ద ఎత్తున షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్నారు. దీంతో సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో జీవి మాల్ యాజమాన్యం మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం ఉమామహేశ్వరరావు, డైరెక్టర్లు వాసు, మురళి, అంకిత్, రేవంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాల్ యజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

నగరాలకు దీటుగా కోదాడ అభివృద్ధి

నగరాలకు దీటుగా కోదాడ అభివృద్ధి చెందుతుందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో ప్రారంభమైన ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ జీవీ మాల్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ



కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, అనంతగిరి జెడ్పీటీసీ కొనతం ఉమా శ్రీనివాస్‌రెడ్డి, చిలుకూరు జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, నడిగూడెం జెడ్పీటీసీ బాణాల కవిత నాగరాజు, మోతే జెడ్పీటీసీ పందిళ్ళపల్లి పుల్లారావు, జెడ్పీటీసీ కృష్ణకుమారి శేషు, మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ, చిలుకూరి ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, కౌన్సిలర్లు బత్తినేని హనుమంతరావు, కొల్లా ప్రసన్నలక్ష్మి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- ఫిర్యాదు పరిష్కారం విధానాన్ని స్పష్టంగా తెలియజేయాలి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు

నవ తెలంగాణ సూర్యాపేట కలెక్టరేట్.

ప్రజావాణిలో వచ్చు ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్లోని ఆవరణలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ పాటిల్ హేమంత కేశవ్ తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజల నుండి వచ్చిన విన్నపాలను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఫిర్యాదు పరిష్కార మార్గాన్ని స్పష్టంగా ఫిర్యాదుదారునకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈరోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 42 దరఖాస్తులు అందజేయడం జరిగిందని ,దీనిలో తాసిల్దార్లకు 22 దరఖాస్తులు, ఇతర శాఖలకు 15 దరఖాస్తులు, డి ఆర్ డి ఓ కు 5 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించడం జరిగిందని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో నూతన కలెక్టరేట్ కార్యాలయం వెళ్ళు రోడ్లన్నింటికీ త్రిలేయర్ ప్లాంటేషన్ చేయాలని సుందరమైన పూల మొక్కలను నాటాలని మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డికి తెలిపారు. దళిత బంధు లబ్దిదారుల ఎంపిక లో జరుగుతున్న తీరుతెన్నులను కలెక్టర్ ఈ డి ఎస్ సి కార్పొరేషన్ బి శిరీష ను అడిగి తెలుసుకున్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ వచ్చిన దరఖాస్తులను తాసిల్దార్, ఎంపీడీవోలు ప్రభుత్వ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మన ఊరు మనబడి పనులు వేగవంతంగా జరగడంలేదని స్పెషల్ ఆఫీసర్లు మన ఊరు మనబడి పనులను పరిశీలించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా సకాలంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో



నిర్మితమవుతున్న గ్రామపంచాయతీ బిల్డింగుల వివరాలను, అలాగే ఇంకా పెండింగ్లో ఉన్న 11 పంచాయతీల గురించి కలెక్టర్ పి ఆర్ ఈ ఈ ని అడిగి తెలుసుకున్నారు. తాసిల్దార్లు కొన్ని పంచాయతీ బిల్డింగుల స్థల సేకరణ నివేదికను ఆర్డీవోలకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు కేటాయించిన2,200 ఎకరాల లక్ష్యం కాగ పూర్తి చేసిన లక్ష్యాలను హార్టికల్చర్ల అధికారి శ్రీధర్ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు నిల్వల గురించి కలెక్టర్ వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అడిగి తెలుసుకున్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో బీసీ రుణాల క్రింద వచ్చిన దరఖాస్తులు మొత్తం 23, 374 కాగ వీటిని పూర్తిగా పరిశీలించిన పిదప ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని బిసి సంక్షేమ శాఖ అధికారి పి ఎస్తేర్ కలెక్టర్కు వివరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ 2021- 22 సంవత్సరానికి సంబంధించిన చీఫ్ ల ప్లానింగ్ ఆఫీసర్ రూపొందించిన గణాంకాల హ్యాండ్ బుక్కును డిప్యూటీ డైరెక్టర్ డి శివకుమార్, సిపిఓ వెంకటేశ్వర్లు, డి శ్యాం, శ్రీనివాస్ తో కలిసి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజేంద్రకుమార్, ఆర్డిఓ కిషోర్ కుమార్ ,జెడ్పి సీఈవో సురేష్ కుమార్, డి ఆర్ డి ఓ పి డి కిరణ్ కుమార్, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిపిఓ యాదయ్య, డీఈవో అశోక్, కలెక్టరేట్ ఏవో శ్రీదేవి, డిటిడిఓ శంకర్, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఆలేరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

ఆలేరుటౌన్: ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జూకంటి ప్రణదీఎబాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరేపల్లి నారాయణ, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ తెలిపారు. ప్రణదీప్ సీటు సాధించటం పట్ల సోమవారం పాఠశాల ఎస్ఎంసి చైర్మెన్ సీస గోవర్ధన్, ఉపాధ్యాయులు శ్యామసుందరి, కోటగిరి శేఖర్, మంద సోమరాజు, హరినాథ్ రెడ్డి, యోగేశ్వరరావు, మురళి, సాంబశివ, ఖాజా అలీ, నవీన్ కుమార్, సత్యనారాయణ, రవి, వేణు, శ్యామసుందరి, కవిత, మేరీ స్వరూప రాణి, , లక్ష్మమ్మ, స్వర్ణలత, మీరా, దుర్గమ్మ సీఆర్పీ తిరుపతి తదితరులు అభినందించారు.

సంఘ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

ఆలేరుటౌన్ : సంఘమిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో మూడవ విడత భాగంగా ఆలేరుకు చెందిన 39 మంది లబ్ధిదారులకు కంటి ఆపరేషన్లు పుష్పగిరి కంటి హాస్పిటల్లో జూన్ 30వ తేదీన విజయవంతంగా చేయించడం జరిగిందని సంఘమిత్ర సేవా సమితి అధ్యక్షులు బొట్ల సంపత్ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రాంత పరిసర ప్రజలకు ఇప్పటివరకు డాక్టర్ల సహకారంతో మొత్తం 85 ఆపరేషన్లు పూర్తయినట్లు తెలియజేశారు. చెప్పారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర సభ్యులు కంతుల శంకర్, సిద్ధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల హామీలు ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలి



- ఇంటి స్థలం లేని 125 గజాల స్థలం ఇచ్చి , ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ- భువనగిరి రూరల్

పాలకులు ఎన్నికల ముందు ఇచ్చే హామీలన్నీ ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలి కానీ నేడు ఎవరు అధికారం చేపట్టిన ఓట్లు, సీట్లు తప్ప ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం మాత్రం కాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జాహంగీర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. ఇప్పటికైనా ఇండ్ల స్థలాలు లేని పేదలందరినీ గుర్తించి 125 గజాల ఇంటి స్థలం ఇచ్చి , ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వరూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇండ్లు, ఇంటి స్థలయి, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం, పూర్తయిన డబల్ బెడ్రూంల పంపిణీ చేయాలని, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో పాలకులు ఎవరు మారిన, అధికారంలోకి వచ్చిన పేదల బతుకులు మారడం లేదని పేదల బతుకు దెరువు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోయిలేకుంట ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా నేటికీ 30 శాతానికి పైగా మంది ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక పోవడం దారుణమన్నారు. ఉన్నోళ్లకు వేలాది గజాలలో పెద్ద పెద్ద బవంతులు నిర్మాణం చేసుకుంటుంటే కూలీలు, పేదలకు కనీసం పూరి గుడిసె కూడా లేదన్నారు. కుటుంబమే లేని ప్రధానమంత్రికి ఉండడానికి ప్రభుత్వ సొమ్ము రూ.467 కోట్లతో ఢిల్లీలో ఇల్లు కడుతుంటే పేదలు నివసించడానికి ఎందుకు రూ.15 లక్షలు ఇవ్వరని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు లేని పేదలందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఎందుకు రాష్ట్రంలో ఒక్క ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతోరూ. 3 లక్షలు కొందరికి ఇస్తానని చెప్పడం సరికాదన్నారు. గ్రామసభల ద్వారా ఇంటి స్థలం ఉన్న వారందరికీ ఎంపిక చేసి గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇంటి స్థలం లేని వారికి 125గజాల స్థలం, ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ 125 గజాల స్థలం పట్టా చేసి ఇవ్వాలని, ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం 5లక్షల ఆర్థిక సహాయం అందించాలని, కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇల్లు లేని పేదలందరికీ పంపిణీ చేయాలనిడిమాండ్ చేశారు. గతంలో పట్టా పొందిన ప్రజలందరికీ ఇండ్ల జాగ సరిహద్దులను చూపించి భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న పేదలపై ప్రభుత్వం నిర్బంధం ఆపి అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గుండాల మండల కేంద్రంలోని సర్వే నెంబరు 168లో 28 ఎకరాల 30 గుంటల భూమిని సేద్యం చేసుకుంటున్న దళితులందరికీ పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి నూతన పాస్‌బుక్కు ఇవ్వాలని కోరారు. రానున్న కాలంలో ప్రజా సంఘాల పోరాట వేదిక ,సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉంటాయో ఆ భూములలో జెండాలు పాతి పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూములు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ కొండమడుగు నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, రైతు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దయ్యాల నరసింహ, మద్దపురం రాజు , కల్లుగీత కార్మిక సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి బొల్లగాని జయరాములు మాట్లాడారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా దగ్గరకు వచ్చిన జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగలక్ష్మి, భువనగిరి ఆర్డీఓ భూపాల్ రెడ్డి లకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ పోరాట సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నంపట్ల కృష్ణ, సందెల రాజేష్ , ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ, వీర్లపల్లి ముత్యాలు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ ప్రజాసంఘాల నాయకులు ఎండి. పాషా, గూడూరు అంజిరెడ్డి, సిరుపంగి స్వామి, బొడ్డుపల్లి వెంకటేష్, బూరుగు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు,కోట రామచంద్రారెడ్డి, పల్లర్ల అంజయ్య, బోడభాగ్య, మాయ కృష్ణ, ధూపాటి వెంకటేష్, రాగీర్ కిష్టయ్య, బొజ్జ బాలయ్య, కూకుట్ల చొక్కా కుమారి, కూల్లూరి నాగమణి, మామిడి సరూప, పద్మ, కొండపురం యాదగిరి, బొల్లెపల్లి కిషన్, దొడ్డి బిక్షపతి పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన జెడ్పీచైర్మెన్,ఎమ్మెల్యే

నవతెలంగాణ- వలిగొండరూరల్



మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామంలో బీటీ రోడ్డు,సీసీ రోడ్లను, అండర్ డ్రైనేజీలను,నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సోమవారంజెడ్పీచైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఎల్‌ఓసీ, ముఖ్యమంత్రి సహాయ నిధి అందిస్తూ అండగా ఉంటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీసాల శేఖర్, ఎంపీపీ నూతి రమేష్ రాజు, జెడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమా బాలనరసింహ, ఉపసర్పంచ్ సోలిపురం అరవింద్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి,గూడూరు శివశాంత్ రెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి, చెరుకు శివయ్య గౌడ్, ఎలిమినేటి సత్యనారాయణ, అయిటిపాముల ప్రభాకర్, ఎమ్మే లింగస్వామి, మాధ శంకర్ గౌడ్, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

వర్కట్‌పల్లిలో బడిబాట కార్యక్రమం

నవతెలంగాణ -వలిగొండ రూరల్

మండల పరిధిలోని వర్కట్‌పల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలచేత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జెడ్పీచైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్ రాజ్ , జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాత రాజు ఉమా బాల నరసింహ, సింగిల్ విండో చైర్మన్ సుర్కంటి వెంకట్ రెడ్డి , గ్రామ సర్పంచ్ మీసాల శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనీఫ్ అహ్మద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వప్న, మహేశ్వర్ పాల్గొన్నారు.

నోటుబుక్స్ పంపిణీ

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలోని ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి చదివే విద్యార్థులకు సోమవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మెన్ కస్తూరి శ్రీ చరణ్ సమకూర్చిన నోట్ బుక్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్ రెడ్డి, సామిడి నవీన్ రెడ్డి,వీరమల్ల కార్తీక్ గౌడ్, బొడిగ అశోక్ గౌడ్, ఎస్ఎంసిచైర్మెన్ దూసరి వెంకటేశం గౌడ్, ప్రభాకర్, పల్చం శివ, కొండ నవీన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయీబ్రాహ్మణులు

నవతెలంగాణ -భువనగిరి

భువనగిరి పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రముఖులను కలిసిన జూకంటి రవీందర్

నవతెలంగాణ- ఆలేరుటౌన్

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని, ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, జెడ్పీచైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డిలను ఆలేరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు జూకంటి రవీందర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పూల బొకే అందజేశారు. న్యాయపరమైన అంశాల గురించి వారితో చర్చించారు.

మాజీ ఎంపీ చకిలం శ్రీనివాస్ వర్ధంతి

నవతెలంగాణ - భువనగిరి

మాజీ పార్లమెంట్ సభ్యులు చకిలం శ్రీనివాస్ వర్ధంతి స్థానిక ప్రిన్స్ కార్నర్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోచంపల్లి రమణారావు, పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, పాదరాజు ఉమా శంకర్, ఆకారం రమేష్, చందుపట్ల రామ్ మోహన్ రావు, చందుపట్ల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అసంఘటితరంగా కార్మికులకు పెన్షన్స్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ యాదగిరిగుట్ట



రాష్ట్రంలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని శుభం ఫంక్షన్ లో జరిగిన హిందూ మజ్దూర్ సభ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన మాట్లాడారు కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం వెయిట్ జీవోలు గెజిట్ చేసి వెంటనే అమలు చేయాలన్నారు. మొత్తం కాంట్రాక్టు వ్యవస్థని రద్దు చేయాలని డిమాండ్ చేశారు .అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు .కార్మిక సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు.హెచ్ఎంఎస్ నాయకులు పి నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా ఏర్పాట్లు

నవతెలంగాణ -ఆలేరుటౌన్



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కొరకు, కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో కృషి చేస్తుందని బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షులు బింగి గణేష్ అన్నారు. పట్టణంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వివిధ రకాల వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధిలో వెనుకంజలో ఉన్న ఆలేరు నియోజకవర్గంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, మైనారిటీ గురుకుల పాఠశాల, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కే దక్కిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగిల్ల రాజు, కటకం బాలరాజు, అందే భరత్, పరిశే నరేష్, బాసాని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలివ్వాలి

నవతెలంగాణ- ఆలేరు టౌన్



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. పట్టణ కేంద్రంలో సోమవారం పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేయాలని, కల్తీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెడ్డు ఆంజనేయులు,చౌడబోయిన పరశురాములు, బొడ్డు ఆంజనేయులు, కొరుటూరు శీను, ఉప్పలయ్య బీరప్ప జాంగిర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర మహాసభ వాల్ రైటింగ్

ఆలేరుటౌన్ :ఈ నెల4,5 న ఇల్లందులో జరిగే ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర 8వ మహాసభలు విజయవంతం చేయాలని ఆలేరు పట్టణంలో సోమవారం వాల్ రైటింగ్ రాశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ ,జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరేంద్రబాబు నాయకులు పూర్ణ భాస్కర్, ఆర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

6 నుండి గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె



- ఉద్యోగ కార్మిక జేఏసీ జిల్లా జిల్లా చైర్మెన్ దాసరి పాండు

నవతెలంగాణ-భువనగిరి

పంచాయతీ సిబ్బం ది సమస్యలు పరిష్కరించాలని 6 వ తేదీ నుండి జరిగే రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక జిల్లా చైర్మెన్ దాసరి పాండు అన్నారు. సోమవారం సమ్మె వాల్ పోస్టర్లను సోమవారం స్థానిక సుందరయ్య భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జి ఓ 60ప్రకారంగా స్వీపర్లకు 15,600 వేతనం చెల్లించాలని కారో బారు ఎలక్ట్రీషన్లు ఆపరేటర్లు డ్రైవర్లు బిల్ కలెక్టర్లకు 19500 చెల్లించాలని కారోబారి బిల్లు కలెక్టర్లను సహాయ కార్యదర్శిలుగా నియమించాలని కోరారు. . ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యా దర్శి మాయ కృష్ణ గ్రామ పంచాయతీఉద్యోగ కార్మిక జేఏసీ జిల్లా సలహాదారులు గణపతి రెడ్డి జిల్లా కన్వీనర్లు పొట్ట యాదమ్మ గడ్డం ఈశ్వర్ బందేల బిక్షం, మంద యాదగిరి, ఐలయ్య, సిందెకి యాదగిరి, నర్సింహ్మా, గణేష్, పరమేశ్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6 నుండి తలపెట్టిన సమ్మె నోటీసను సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఙ్ఞాన ప్రకాష్ రావుకు గ్రామపంచాయతీ కార్మికుల మండల జేఏసీ ఆధ్వర్యంలో అందజేశారు . ఈ కార్యక్రమంలో ఆలేరు మండల కారోబార్లు గ్యాధ పాక నాగరాజు, రామ నర్సింహారెడ్డి ,ఉప్పలయ్య, ప్రతాపరెడ్డి ,ప్రవీణ్ ,మహేష్ ,శివ ,రమేష్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ -యాదగిరిగుట్ట



మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు .సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినదినం యాదాద్రి మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులు చేయించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా కు సరిపడ సిబ్బందిని తీసుకోవాలని కోరారు .శానిటేషన్ అధికారులు సిబ్బందిని కార్మికులు ఆవేదన చెందుతున్నారన్నారు .ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు,మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు పేరబోయిన స్వామి ,కార్మికులు సుధగాని అయ్యం,కొన్నే ఐలమ్మ ,అండాలు ,తిరుమల చంద్రకళ,కోన్నే రామచందర్ జయమ్మ అయిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి

- ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు తిమ్మాపురం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ- రామన్నపేట

ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండలంలోని అన్ని గ్రామాలకు, వెల్లంకి గ్రామానికి అనేక రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి కొన్ని పూర్తి చేయించారని అంతలోనే ఓపిక లేకుండా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఎల్లంకి ఎంపీటీసీ-2, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు తిమ్మాపురం మహేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వెల్లంకి గ్రామ ప్రజలకు, గ్రామంలోని అన్ని పార్టీల నాయకులందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.రామన్నపేట నుండి జై కేసారం వరకు రోడ్లు నిర్మాణం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించి పూర్తి చేశారన్నారు. వెల్లంకి నుండి గుంద్రంపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. అది కూడా త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తారన్నారు. కానీ అంతలోనే ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నయన్నారు. రామన్నపేట మండలంలో, గ్రామంలో ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేశారన్నారు. రామన్నపేట నుండి జై కేసరం వరకు రోడ్డు ఈ మధ్యనే మన ఎమ్మెల్యే చొరవతో నిర్మాణం పూర్తయిందన్నారు. ఇప్పుడు ఆ రోడ్లు మీద హెవీ వెహికిల్స్ వెళితే ఆ రోడ్డు పాడవుతుందని, ప్రతిపక్ష పార్టీల నాయకులు ముందు ఉన్న రోడ్లు పాడవకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గొడుగులు పంపిణీ

నవతెలంగాణ -భువనగిరి

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ జన్మదినం పురస్కరించుకొని వీధి వ్యాపారులకు సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్ లో నిర్మించిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నర్సింగరావు , జిల్లా అధ్యక్షులు పీవీ. శ్యాంసుందర్రావు సౌజన్యంతో వీధి వ్యాపారులకు ఎండావానకు ఇబ్బంది లేకుండా గొడుగులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చందా మహేందర్ గుప్తా ,పట్టణ అధ్యక్షులు ఉమా శంకర్ రావు, జిల్లా కార్యదర్శి మరియు కౌన్సిలర్ రత్నపురం బలరాం , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు డిఎల్ఎస్ నాయకులు నరసింహ చారి , నల్ల మాస వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాలభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

నవ తెలంగాణ -భూదాన్ పోచంపల్లి



గ్రామాల అభివృద్ధి చేయడం తమ లక్ష్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని భువనగిరి శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి అన్నారు సోమవారం మండల పరిధిలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వీధిలైట్లు సమస్యలు పరిష్కరించేందుకు ఎంతో కృషి చేశామని భువనగిరి నియోజకవర్గంలో అధిక నిధులు పోచంపల్లి కేటాయించి గ్రామాలలోని సమస్యలు పరిష్కరించుకున్నా మన్నారు. గత ప్రభుత్వాలు ఎలాంటి అభివృద్ధి చేయలేని అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వం 9 ఏండ్ల కాలంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతుల సంక్షేమానికి పేదలకు పెన్షన్లు వితంతువుల పెన్షన్లు వికలాంగుల పెన్షన్లు ఎన్నో సంక్షేమ పథకాలను తోపాటు కల్యాణ లక్ష్మి ప్రజా సంక్షేమం కోసం గ్రామాలభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. గ్రామాల్లోని ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వంక మామిడిలో బాధితుడు సుంకరికిష్టయ్యకు సర్జరీ కోసం 2లక్షలా 50 వేల రూపాయల ఎల్‌ఓసీ ఎమ్మెల్యే అందజేశారు. వంకమామిడిలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని పెద్దగూడెంలో నూతన గౌడ సంఘభవనానికి శంకుస్థాపన చేశారు. జిబ్లాక్ పల్లిలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. బీటీ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. పోచంపల్లి పురపాలక కేంద్రం సీతవానిగూడెం నుండి జగత్ పల్లి సుమారు 7 కిలోమీటర్లు రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి జెడ్పిటిసి కోట పుష్పలత వైస్ ఎంపీపీ పాక వెంకటేశం ఎంపీటీసీ బత్తుల మాధవి ఆయా గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా సదస్సు

నవతెలంగాణ- ఆలేరు రూరల్



మండలంలోని కొలనుపాకలో గ్రామంలో సోమవారం అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సదస్సును మందాడే అమరేందర్ రెడ్డి కళ్లెపు అడవయ్య మామిడాల సోమయ్య అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకు వస్తున్నటువంటి రైతు వ్యతిరేక విధానాలను రైతు కూలీలంతా వ్యతిరేకిస్తూ బలమైన ఉద్యమాలు చేయాలన్నారు. అనంతరం యాదాద్రి జిల్లా కార్యవర్గాన్ని , భువనగిరి డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఏఐకెమ్ఎస్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మామిడాల సోమయ్య ,ఉపాధ్యక్షులుగా ఇక్కిరి సహదేవ్, ప్రధాన కార్యదర్శిగా కళ్లేపు అడవయ, సహాయ కార్యదర్శి మాలోత్ మోతిలాల్ కోశాధికారి నేరేడు స్వామి కార్యవర్గ సభ్యులుగా బొమ్మ కంటీ శీను, మందడి అమరేందర్ రెడ్డి కొత్తపేట వీరమల్లు ,ఎర్ర మల్లేష్, ఏఐకేఎంఎస్ భువనగిరి డివిజన్ కార్యవర్గం అధ్యక్షులుగా నేరేడు స్వామి ఉపాధ్యక్షులుగా మామిడాల బాల మల్లేష్ ,ప్రధాన కార్యదర్శిగా మాలోత్ మోతిలాల్ సహాయ కార్యదర్శి బొమ్మ కంటి శీను కోశాధికారిగా కళ్ళేపు శంకర్ కార్యవర్గ సభ్యులు ఐలయ్య, యాకయ్య ,దొంతిరి అంజిరెడ్డి, బుడిగె లక్ష్మయ్య ,కోలాసోములు బాల్‌రెడ్డి, వంగాల మధుసూదన్ రెడ్డిలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం నాగరాజు, మారుజోడు సిద్దేశ్వర్ ,జాలపు రాజి రెడ్డి, ఎలగందుల సిద్దులు, శికిలం కుమారస్వామి ,యిక్కిరి శ్రీనివాస్ ,పంజాల మురళి ,బూషే శ్రీశైలం మామిడాల ప్రవీణ్ మామిడాల భాను, మామిడాల మహేష్, మామిడాల మధు, ధారా బాస్కర్, కుర్ర సర్వన్, జట్ట లక్ష్మణ్ ,పైసా రాందాస్ ,కోలా క్రాంతి, కొంగరి యాదమ్మ, బండి బాలరాజ్ ,బండి నరేష్, మాటూరు అఖిల్ ధర్మ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణం ఆపాలి



- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన అఖిలపక్ష నాయకులు

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం

మండలంలోని అల్లందేవిచెరువు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణం పనులను ఆపాలని కోరుతూ సోమవారం గ్రామ అఖిలపక్ష పార్టీల నాయకులు ఎంపీడీవోకు ఫిర్యాదు ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్థలంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పనులు చేపడుతున్నారన్నారు. గ్రామ సర్పంచ్ కనీసం గ్రామ సభ పెట్టకుండా, గ్రామ ప్రజల నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా తన సొంత నిర్ణయంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులు చేస్తున్నట్లు ఆరోపించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మించే ఈ పంచాయతీ భవన నిర్మాణం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీంతో పాఠశాలకు స్థలం లేకుండా పోతుందన్నారు.అట్టి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఎంపీడీవోను కోరారు.గ్రామాన్ని సందర్శించి స్థల పరిశీలన చేయాలన్నారు. నూతనంగా నిర్మించబోయే గ్రామ పంచాయతీ భవనాన్ని మరొక చోట నిర్మించాలన్నారు.వినతి పత్రం అందజేసిన వారిలో అల్లందేవిచెర్వు గ్రామ సీపీఐ (ఎం), బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన అఖిలపక్ష నాయకులు దోనూరు నర్సిరెడ్డి,సుర్వి రాజుగౌడ్,బాత్క శేఖర్ యాదవ్,గుండు జంగయ్య గౌడ్,సుర్వి చంద్రంగౌడ్,గుండు సుధాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బాలునాయక్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-చింతపల్లి



చింతపల్లి మండలంలోని మాల్, కురుమేడు, చింతపల్లి మండల కేంద్రంలో ఘనంగా మాజీ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కురుమేడులో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బుర్రి కృష్ణయ్య, ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో మండల అధ్యక్షులు అంగరేకుల నాగభూషణ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవరకొండ మాజీ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్‌ను గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. మండల కేంద్రంలోని అనాధలు వృద్ధులు వితంతువులకు వికలాంగులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కురుమేడ గ్రామశాఖ అధ్యక్షులు బుర్రి కృష్ణ గౌడ్, మాజీ జెడ్పిటిసి హరి నాయక్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఉప్పు శేఖర్, నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాదిరి మల్లేష్, మాజీ సర్పంచ్ గౌని జంగయ్య గౌడ్, మాజీ సర్పంచ్ కురుమేటి బజారు, పాండ్యా నాయక్, కిషన్‌నాయక్, రవినాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 4 పరీక్ష డ్యూటీ చేసిన అంగన్‌వాడీ టీచర్లకు డబ్బులు ఇవ్వాలి

నవతెలంగాణ-దేవరకొండ

గ్రూప్-4 పరీక్షల సందర్భంగా శనివారం నిర్వహించిన పరీక్ష సెంటర్ల వద్ద డ్యూటీలు నిర్వహించిన అంగన్వాడి టీచర్లకు డబ్బులు చెల్లించాలని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవార. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో డిటిఓ శ్రీదేవి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడారు. తక్షణమే డ్యూటీలు నిర్వహించిన టీచర్ల అందరికీ డబ్బులు చెల్లించాలని ఆయన కోరారు దేనిపక్షంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి ,డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు ,జే .వెంకట్ రాములు, మల్లయ్య అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈ .అరుణ, ప్రాజెక్ట్ నాయకులు స్వప్న, భాగ్య ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చందంపేట ఎంఈఓను సస్పెండ్ చేయాలని వినతి

నవతెలంగాణ-దేవరకొండ

పిల్లలు లేని ప్రభుత్వ పాఠశాలకు మన ఊరి మనబడి ప్రణాళికలో నిధులు కేటాయించి దుర్వినియోగం చేసిన చందంపేట మండల ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని బొల్లారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పిల్లలు లేరని గత రెండు సంవత్సరాల క్రితం మూతపడిన ప్రాథమిక పాఠశాలకు మన ఊరి -మనబడి ప్రణాళికలో నిధులు కేటాయించి సున్నా ఎన్రోల్మెంట్ ఉన్న ప్రాథమిక పాఠశాలకు నాణ్యతలేని గదులు కట్టి ప్రభుత్వ ఖజానాకు ఎసరు పెట్టిన మండల విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దీపావత్ చందు, కుర్ర రాహుల్, కంభంపాటి సాయి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు సన్మానం

నవతెలంగాణ- ఆలేరు రూరల్

మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన బండారి ప్రసాదు ముదిరాజు తెలంగాణ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండారి దేవదానం, కిష్టయ్య, సత్తయ్య మల్లేష్, సిద్ధులు, రమేష్ ,సూర్యం, భాస్కర్ ,లక్ష్మి, నరసయ్య ,ఝాన్సీ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

విద్యా సంవత్సరం 2023 - 24 కు సంబంధించి జిల్లాలో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఇంగ్లీష్ మీడియం ఒకటవ తరగతి (డేస్ స్కాలర్), ఐదవ తరగతి (రెసిడెన్షియల్)లలో ప్రవేశాల కోసం విద్యార్థులు నుండి దరఖాస్తు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 తర్వాత గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారి వార్షికాదాయం 1,50,000 లోపు పట్టణాలలో నివసించే వారి వారి వార్షికోదాయం 2 లక్షల రూపాయల వరకు ఉండాలని పేర్కొన్నారు. మీసేవ చే స్వీకరించిన కుల, ఆదాయ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో కార్యాలయ పని దినాలలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. పథకమునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ సభ్యులలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందుగాని గతంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కిందగాని చదువుకున్నట్లయితే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన డ్రా ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్లోని ఉదయాదీధ్యా భవన్ లో ఉంటుందని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు రెండు లక్షల ప్రమాద బీమా మంజూరు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల మున్సిపాలిటీ కేంద్రం 10వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఏరుకొండ మహేష్ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతునికి పార్టీ సాధారణ సభ్యత్వం కలిగి ఉన్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేకర్ నకిరేకల్ శాసనసభ్యులు చిరుమర్థి లింగయ్య దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే స్పందించి ప్రమాద భీమా 2లక్షల చెక్కును మంజూరు చేయించారు. సోమవారం మహేశ్ తండ్రి లక్ష్మయ్యకి రూ. 2 లక్షల బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కును మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్‌తో కలిసి వారి ఇంటికి వెళ్ళి కుటుంబం సభ్యులను పరామర్శించి వారికి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆది మల్లయ్య, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, మందడి జనార్దన్ రెడ్డి, దాసరి నరసింహ, పొన్నం లక్ష్మయ్య, గుండెబోయిన సైదులు, జగిని బిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీని గడువులోపు పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



పోడు పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. పోడు పట్టాల పంపిణీ, గృహ లక్ష్మి, ఎరువులు,విత్తనాల నిల్వలు, ఆయిల్ పామ్ సాగు, నివేశన స్థలాల అందజేత, కస్టమ్ మిల్లింగ్, తెలంగాణకు హరితహారం, బీ.సీ లకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ తదితర అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ సమీక్ష నిర్వహించారు. పోడు పట్టాల పంపిణీలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లోపు అన్ని జిల్లాలలో పట్టాల పంపిణీ పూర్తి చేయాలని గడువు విధించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. యూరియా, డీ.ఏ.పీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. ఆయిల్ పామ్ సాగు విషయమై సీ.ఎస్ సమీక్షిస్తూ, ఖరీఫ్ సీజన్లో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా కృషి చేయాలన్నారు. గతేడాది తరహాలోనే పకడ్బందీ ప్రణాళికతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అలాగే అర్హులైన వారికి నివేశన స్థలాల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఎఫ్.సీ.ఐ గిడ్డంగులలో స్థలం సరిపడని పక్షంలో, సివిల్ సప్లిస్ గిడ్డంగులను వినియోగించుకోవాలని అన్నారు. జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు రైస్ మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా చొరవ చూపాలన్నారు. రోడ్లకు ఇరువైపున, చెరువులు, కాల్వ గట్లపైన, ఇరిగేషన్ భూములు, అటవీ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటేలా గుంతలు తవ్వించాలని సూచించారు. వర్షం అనుకూలించిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలన్నారు. బీ.సీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ తదితర పథకాల అమలు తీరు, ప్రగతిని సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా,డి.అర్.డి. ఓ. కాళిందిని, డి.పి.ఓ విష్ణు వర్ధన్, మున్సిపల్ కమిషనర్ రమణా చారి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



నార్కట్‌పల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం అని కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. సోమవారం కళాశాల తరగతుల ప్రారంభోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జడ్పీ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి సహకారంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను అన్ని హంగులతో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భవన యజమాని జీ.శ్రవణ్‌రెడ్డి, అధ్యాపకులు పృథ్వి మనోహర్, కరుణా దేవి, మల్లెబోయిన రామలింగయ్య, సాంబయ్య, నడింపల్లి వెంకటేశ్వర్లు, నడింపల్లి వెంకన్న, ఈశ్వరాచారి, సరస్వతి, స్వాతి, గోవర్ధన్, శంబయ్య సురేష్, రవిశంకర్, గుమాస్తా శంకర తదితరులు పాల్గొన్నారు.

దళిత బందులో ప్రాధాన్యతను ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

దళిత బంధులో మొదటి ప్రాధాన్యతను ఇచ్చి నియోజకవర్గానికి 40 శాతం కేటాయించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి నల్లగొండ జిల్లా అధ్యక్షులు గడ్డం యాదగిరి చిందు జిల్లా అదనపు కలెక్టర్‌ను కోరారు. సోమవారం ప్రజావాణిలో ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బందు పథకాన్ని స్వాగతిస్తున్నామని జిల్లాలో జనాభా ఉండి అత్యంత వెనుకబడిన ఉపకులాలైన మోచి, డక్కలి, చిందు, మహార్, నేతకాని, ఇలా అనేక ఉపకులాలకు దళిత బంధు మొదటి విడతలో అవకాశం లభించలేదని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఏవి అందడం లేదని ఆవేదన చెందారు. రెండో విడత దళిత బంధు పథకంలో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బందెల విష్ణు, దాసి కుదవ, గడ్డం పశుపతి, దుర్గేష్, శ్రీను, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

శకాంబరిగా కనకదుర్గాదేవి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

పట్టణంలో సోమవారం శ్రీ కనకదుర్గ ఆలయంలో కనకదుర్గాదేవి వివిధ రకాల కూరగాయలతో అలంకరించబడి ఆకాంబరి దేవిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆలేటి రంగన్న శాకాంబరి ఉత్సవాల సందర్భంగా ఆలేరు కనకదుర్గమ్మ, పూర్తిగా కూరగాయల అలంకారంతో ఆలేరు ప్రజలకు దర్శనమిచ్చింది.అమ్మవారి కృపాకటాక్షాలతో ఆలేరు ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ- భువనగిరిరూరల్

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరిస్తూ, వారి వేతనాలను పెంచాలని, లిస్టు త్రీ లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ లో 280 మందిని తిరిగి వీధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్ టి ఈ లుగా గుర్తించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ లెటర్ ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను కలవమని కోరగా, మంత్రి దయాకర్ రావు కలిసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ అండ్ ఆర్ డి ప్రిన్సిపల్ సెక్రెటరీ సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశించినట్లు తెలిపారు.

బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని పసునూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని ఆకారం చింటు, జెస్సీ అనే చిన్నారులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త గురిజ మహేష్ హెల్పింగ్ హాండ్స్ టూ నీడి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వారికి నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి విద్యకు సంబంధించి సహాయ సహకారాలను అవసరం నిమిత్తం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మొగుదాల పార్వతమ్మ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బుషిపాక శాంతి కుమార్, మాదిగ బీజేవైఎం జిల్లా కోశాధికారి పానగంటి మహేష్, వెలుగు సొసైటీ రూరల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ మంగి మహేష్, కాటిక రమేష్ ,మంగి ముత్తయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు ఎస్సై సురేష్ కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-చండూరు

చండూర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు వడ్డేపల్లి భాస్కర్‌సాగర్ ఆధ్వర్యంలో చండూరు మండల నూతన ఎస్సై గా సురేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేష్, కల్లెట్ల మారయ్య సాగర్, ఆవుల అశోక్ యాదవ్, మల్హూర్కర్ దేవ, చొప్పరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-చింతపల్లి

ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ప్రతి ఒక్క నిరుద్యోగ మహిళ సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టర్ ఆఫీసర్ ఆరోగ్యమ్మ, వాలంటీర్స్ లక్ష్మి అన్నారు. సోమవారం చింతపల్లి మండలంలోని కురుమేట్ గేట్ వద్ద వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాలంటీస్ లక్ష్మి, వెంకటాచారి ,టైలర్ టీచర్ శోభ, బోయ ప్రేమలత, కురుమేటి లక్ష్మి, మరియు శిక్షణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలోని శ్రీ ఐశ్వర్య సాయి మందిరంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ వేరువేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ కాసం లింగయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం సత్తయ్య యాదవ్, ఉపాధ్యక్షులు యాట మధుసూదన్ రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, కోశాధికారి ముప్పారపు శ్రీనివాస్, ప్రతినిధులు బండారు వేణుగోపాల్, తోనుపునూరి రాంబాబు, గోలి మంజుల, కడారి అనిత పాల్గొన్నారు.